# నగర అభివృద్ధికి 'శక్తి'

## ప్రాజెక్టు కాల వ్యవధి 11 ఏళ్లు

## అధ్యయానికి రెండేళ్లు... అమలుకు తొమ్మిదేళ్లు



న్యూస్‌టుడే, హైదరాబాద్

**మన నగరం మరో ప్రయోగాత్మక ప్రాజెక్టుకు వేదిక కానుంది. భవిష్యత్తులో మరో మహా పెద్ద నగరంగా ఆవిర్భవించే అవకాశాలున్నట్లు గుర్తించిన జర్మన్ ప్రభుత్వం ఇక్కడ నిత్యాభివృద్ధికి అవసరమైన చర్యలేమిటో అధ్యయనం చేయాలని భావిస్తున్నాయి. అంతేకాదు... ఆ చర్యలను దీర్ఘకాలికంగా ఇక్కడే అమలు చేసి ఫలితాలను రాబట్టాలని కూడా నిర్ణయించాయి. ఈ వినూత్న ప్రాజెక్టు పేరు 'శక్తి'. నిత్య అభివృద్ధి కోసం అమలు చేసే ప్రాజెక్టుకు అవసరమైన నిధులను సైతం జర్మన్ ప్రభుత్వమే భరించనుంది. నగరం అభివృద్ధికి మరింత దోహదపడే ఈ అధ్యయనంపై వచ్చే నెలలో పలువురు నిపుణులతో ఓ వర్క్‌షాపు సైతం నిర్వహించనున్నారు. వివరాలివి...**

భవిష్యత్తులో మహా మహా నగరాలుగా ఆవిర్భవించనున్న వాటిల్లో హైదరాబాద్ ఒకటిగా జర్మన్ ప్రభుత్వం భావిస్తోంది. అందుకే జర్మనీ విద్యా, పరిశోధన మంత్రిత్వ శాఖ (జర్మన్ ఫెడరల్ మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్)... అక్కడి మరికొన్ని సంస్థలను కలుపుకొని చేయదలచిన ఓ అధ్యయనానికి మన దేశంలో బెంగుళూరుతో పాటు హైదరాబాద్‌నూ ఎంపిక చేసింది. భవిష్యత్తులో ఈ నగరాల్లో క్రమం తప్పని నిత్యాభివృద్ధి (సస్టెయిన్డ్ డెవలప్‌మెంట్) కోసం చేపట్టాల్సిన వ్యూహాలు, చర్యలపై ఓ అధ్యయనం చేయనున్నారు. అధ్యయనమే కాదు... ఆ తర్వాత సైతం ఆ క్రమాభివృద్ధి కోసం అవసరమైన ఆ చర్యలన్నింటినీ అమలు చేస్తారు. వినూత్న తరహాలో చేపట్టబోయే ఈ ప్రాజెక్టుకు పేరే... 'శక్తి'. "సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ ఆఫ్ ద మెగా సిటీస్ ఆఫ్ టుమారో"...లోని మొదటి అక్షరాలను తీసుకొని ఈ ప్రాజెక్టుకు 'శక్తి' అని నామకరణం చేయడం విశేషం.

### 'శక్తి' స్వరూపమిదే...

నగరం అంటే జనాభాపరంగా నిత్యం పెరిగేందుకు అవకాశముండే ప్రాంతం. దాని అభివృద్ధికోసం, నీరు, కరెంటు, రవాణాలాంటి మౌలిక సదుపాయాల కల్పన కోసం దీర్ఘకాలికమైన ప్రణాళికలు నిర్వహణ అవసరం. ఆ ప్రణాళికలు, నిర్వహణ అంశాల్లోని ప్రాధాన్యాలను నిర్ణయించడమే ఈ శక్తి ప్రాజెక్టు ఉద్దేశం. ఈ ప్రాజెక్టు నాలుగుదశల్లో కొనసాగుతుంది. తొలి రెండేళ్ల కాలం వ్యవధిలో అమలయ్యే మొదటిదశలో అధ్యయనంలో తేలిన విషయాలను మరింత నిశితంగా పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలను, ప్రాథమ్యాలను గుర్తిస్తారు. ఆ తర్వాత మూడుదశల్లో (ఒక్కో దాని కాల వ్యవధి మూడేళ్లు) అంటే తొమ్మిదేళ్లపాటు ఆ అభివృద్ధి వ్యూహాలను అమలు చేస్తారు. ఇప్పుడు కొనసాగుతున్న కార్యక్రమాలతోపాటు అవలంబించాల్సిన నిత్యం దీర్ఘకాలికంగా జరగాల్సిన అభివృద్ధి కోసం వ్యూహాలు, కార్యాచరణ ప్రణాళికలు, బిజినెస్ మోడళ్లు రూపొందిస్తారు.

### విశేషాలివి...

★ జర్మన్ ప్రభుత్వ విద్యా, పరిశోధన మంత్రిత్వ శాఖతోపాటు పలు విద్యాసంస్థలు అమలు చేస్తున్న ప్రాజెక్టు ఇది.

★ నాలుగు దశల్లో అమలయ్యే ప్రాజెక్టులో భాగంగా తొలి రెండేళ్లు అధ్యయనం. తర్వాతి మూడు దశల్లో (ఒక్కో దశ కాల వ్యవధి మూడేళ్లు) నగరం నిత్యాభివృద్ధి కోసం దీర్ఘకాలిక ప్రణాళికల అమలు.

★ భవిష్యత్తులో పెద్ద మహా నగరాలుగా (మెగాపోలిస్)గా ఆవిర్భవించే నగరాలకు అవసరమైన ముందస్తు దీర్ఘకాలిక ప్రణాళిక సంసిద్ధం చేయడం ఉద్దేశం.

★ ప్రయోగాత్మకంగా చేపట్టే ఈ వినూత్న కార్యక్రమానికి నిధులు సమకూర్చే బాధ్యత జర్మనీదే.

★ 'సిటీస్ ఆఫ్ టూమారో'గా గుర్తించి మన దేశంలో ఎంపిక చేసిన నగరాలు హైదరాబాద్, బెంగుళూరు.

### సహకరించే మరికొన్ని సంస్థలివే...

ఈ ప్రాజెక్టు అమలుకోసం జర్మన్ విద్యా, పరిశోధన మంత్రిత్వ శాఖతోపాటు... యూనివర్సిటీ ఆఫ్ కార్ల్స్రూకు చెందిన ఫ్రెంచ్-జర్మన్ పర్యావరణ పరిశోధన సంస్థ, అదే యూనివర్సిటీకి చెందిన ఎక్వాటిక్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ విభాగం, అప్లయిడ్ జియాలజీ విభాగం, ఫొటోగ్రామెట్రీ, రిమోట్ సెన్సింగ్ విభాగం, అర్బన్ అండ్ రీజినల్ ప్లానింగ్ విభాగం, ల్యాబ్ ఫర్ ప్లానింగ్ ఇన్ ఎ గ్లోబల్ కాంటెక్స్ట్‌లు పాలుపంచుకొనున్నాయి. ఆ యూనివర్సిటీతో మరికొన్ని విశ్వవిద్యాలయాలకు చెందిన పలు విభాగాలతోపాటు... మన దేశానికి చెందిన న్యూఢిల్లీలోని ఐసీఎల్ఈఐ కూడా ఈ అధ్యయనాల్లో పాలుపంచుకోనుంది.

### 'శక్తి'పై ప్రత్యేక సదస్సు

ఇక్కడ 'శక్తి' ప్రాజెక్టు అమలు విషయాలను చర్చించేందుకు జర్మన్ ప్రభుత్వ సంస్థలతోపాటు... హైదరాబాద్ నగర పాలక సంస్థ, యూరోపియన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎనర్జీ రీసెర్చ్, ఐసీఎల్ఈఐ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వచ్చేనెల 12 నుంచి 14 వరకు ఓ భారీ సదస్సును ఏర్పాటు చేయనున్నట్లు ఐసీఎల్ఈఐ దక్షిణాసియా విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఈమనికుమార్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఢిల్లీలోని ఆయన టెలిఫోన్‌లో మాట్లాడుతూ ఈ వివరాలు తెలిపారు.